

# ఓ కలం కల

చాగంటి శరత్ బాబు

"మహానుభావుడు కాదుటండీ?"

"ప్చ్... కలికాలం అంటే ఇదే. ఎంతటివాడు? ఆణిముత్యాలు కదండీ ఆయన రచనలు?"

"ఇంతకీ కారణం చెప్పిందా అది?"

"ఇంకా ఏం చెప్పినట్టు లేదు. అసలు దానికి మొగుడితో కూడా పడి చావదుట. రోజూ గొడవలే నంటున్నారు చుట్టుపక్క వాళ్లు."

"శుద్ధ కంతిరీ సరుకన్నమాట. అయినా మహారచయిత జ్ఞానమూర్తిగారికీ, దీనికీ అసలు సంబంధం ఏమిటి?"

"అదే కదా ఎవరికీ తెలీనిది! అసలు వాళ్లిద్దరికీ పూర్వపరిచయం ఉండే అవకాశం కూడా లేదని పోలీసులు చెప్తున్నారు?"

"అయితే దానికి పిచ్చి ఎక్కిందేమో?"

"పిచ్చి అని మెల్లిగా అంటారేమిటి — ఉన్మాదం. ఎంతటి ఉన్మాదం కాకపోతే ఓ మధ్యతరగతి ఇల్లాలు ఇలా వీధికెక్కి పరాయిమొగాడిని, పైగా అంతటి వాడిని కత్తితో పొడిచి చంపేస్తుందా?"

ఆ రోజు ఆ ఊరిలో ఏ వీధిలో విన్నా ఇవే మాటలు.

❁ ❁ ❁

ఆమె కళ్లల్లో భయంలేదు. నిర్వికారంగా కొంగు వేళ్లకి చుట్టుకుంటూ ఏదో ఆలోచిస్తూ కూర్చుంది. మధ్య మధ్యలో కోపంతో బుసకొడుతోంది.

"ఆయన చచ్చిపోయారు తెలుసా?" అన్నాడో పోలీసు.

ఛటుక్కున లేచింది. ఆ ముఖంలో ఏదో గొప్ప విజయం సాధించిన తృప్తి, గర్వం మెరిసిపోతున్నాయి.

"నిజంగానా — పూర్తిగా చచ్చాడా? హమ్మయ్య" అంటూ తన మెడలో ఉన్న గొలుసు తీసి అతనికి బహూకరించబోయింది.

ఆ కానిస్టేబుల్ అవాక్కయిపోయి చూస్తున్నాడు.

పోలీసులు పట్టుకుని లాకప్‌లో పెడితే ప్రతి ఒక్కరూ చూపించే భావాలేవీ చూపటం లేదామె. పైగా చావు కబురు విని ఆనందంతో బహూమతులిస్తోంది.

"నీకు పిచ్చేమైనా ఎక్కిందా? ఉరిశిక్ష పడుతుంది తెలుసా?" ఆమె నవ్వుతూ గొలుసు గిరగిరా తిప్పుతూ "చచ్చాడు. ఇక బతకడు" అనుకుంటూ వెళ్లి కూర్చుంది.

'చూట్టానికి చక్కగా ఉంది. మంచి ఉద్యోగం చేసే మొగుడు, సొంత కూతుర్లా చూసుకునే అత్తగారు, ఎపార్ట్‌మెంటూ, 'మమ్మీ' అని పిలిచి కొడుకూ... ఏం మనిషో?

'పిచ్చి కాకపోతే ఏమిటిది? రకరకాల రోగాలు..'

❁ ❁ ❁

"తెలుగు వాళ్లంతా సిగ్గుతో తల వంచుకోవలసిన రోజు. ఆంధ్రుల అభిమాన రచయిత, స్త్రీల సమస్యల పరిష్కారం కోసం కలాన్ని కత్తిగా మార్చి పోరాడిన మహా రచయిత శ్రీ జ్ఞానమూర్తి మరణం ఒక తీరని లోటు. పైగా ఒక స్త్రీ ఆయన్ని నిర్దాక్షిణ్యంగా పొడిచి చంపటం మన జాతికే ఒక కళంకం.

"ఏ భారతీయుల స్వాతంత్ర్యం కోసం మహాత్ముడు సర్వస్వాన్నీ ధారపోశాడో ఆ భారతీయుల్లో ఒకడే ఆయనను హత్య చేయటం —

"ఏ మానవుల కోసం ఏసు అవతరించాడో ఆ మానవులే ఆయన్ను సిలువ వేయటం —

"నేడు ఏ స్త్రీల కోసం జ్ఞానమూర్తి కలం పట్టాడో ఆ స్త్రీలలో ఒకరు ఆయన ప్రాణాలు."

ఆ వక్తకి దుఃఖంతో గొంతు పూడిపోయింది.

"ఆమె ఒక మహిళ కాదు. ఆ నరహంతకి సాటి స్త్రీ అయినందుకు స్త్రీల తరపున నేను క్షమాపణ చెప్తున్నాను. జ్ఞానమూర్తి తెలుగు మహిళలందరికీ స్వంత అన్నలాంటి వాడు. ఆయన మరణంతో మాకు పుట్టింటి ఆదరణే కరువైంది" మహిళా మండలి అధ్యక్షురాలు కన్నీళ్లు తుడుచుకుంది.

"రాక్షసుల గురించి విన్నాం. నేడు ప్రత్యక్షంగా చూస్తున్నాం. మానవత్వం మూర్తీభవించిన ఓ మహనీయుడిని అకారణంగా, అన్యాయంగా, అమానుషంగా అంతం చేసిన మనిషి — మనిషే కాదు. ఆమె ఒక రాక్షసి. రెండు కాళ్ల క్రూరమృగం. ఆమెను కఠినంగా శిక్షించనిదే మా గుండె మంట చల్లారదు" కార్యదర్శి కంఠం వణికింది.

"టివి ఎలా పెట్టాలి? పెడితే జ్ఞానమూర్తిగారి రచనలింక వినబడవే? పత్రికలు తెరిస్తే ఏ పేజీలోనూ ఆ మహారచయిత 'కలం' కనబడదే? సాహితీ లోకం తన పెద్ద దిక్కుని కోల్పోయింది. ఆధునిక రచయితలు ఆత్మబంధువుని పోగొట్టుకున్నారు. పాఠకుల మనసుల్లో వ్యథ — ప్రేక్షకుల కళ్లల్లో రక్తం — శ్రోతల చెవుల్లో విషం ఆ దుర్మార్గురాలు — ఆ నీచాతినీచురాలు — ఆ రక్త పిపాసిని బహిరంగంగా ఉరితీస్తే తప్ప ఆ పాపానికి నిష్కృతి లేదు." ఒక మహా రచయిత పిడికిళ్లు బిగుసుకున్నాయి.

ఊరూరా, వాడవాడా ఇదే వరస.

ఆంధ్రావని యావత్తూ ఒక్క పెట్టున భోరుమంది.

ఆ హంతకురాలిపై విరుచుకుపడింది.

✿ ✿ ✿

"నీ పేరు?"

"శారద."

"ఆ పేరు ఎంతటి గొప్ప పేరో తెలుసా?"

"తెలుసు. సర్వకళలకూ ఆమె అధిదేవత — సృజనకు సృష్టికర్త."

"అంత మంచి పేరు పెట్టుకుని ఇలా చేశావా?"

"అవును. ఆమె నన్ను ఆవహించింది. ఆమె ప్రేరణతోనే ఈ పని చేశాను."

"నీకు జ్ఞానమూర్తి ఎలా తెలుసు?"

"ఇన్ని లక్షల, కోట్ల తెలుగు వాళ్లకి ఎలా తెలుసో నాకూ అలాగే తెలుసు."

"అంటే?"

"సాహిత్యం అనే అమృతభాండంలో విషం చిమ్ముతున్న అనేకుల ప్రతినిధి, పెద్దగా తెలుసు."

"వ్యక్తిగతంగా..."

"వ్యక్తిగా వాడితో నాకు పరిచయం లేదు."

"అంటే ఆయన నీకు ఏ ద్రోహమూ చెయ్యలేదన్నమాట."

"ఆ మాట నేను అనటం లేదు. వాడి ముఖం నేను ప్రత్యక్షంగా వాడిని పొడిచిన తర్వాతే చూశాను. వాడు నా ముఖం అప్పుడు కూడా చూసి ఉండడు."

"మరి అతనిపైన అంత కక్ష ఎందుకు నీకు?"

"వాడు నా కాపురంలో నిప్పులు పోశాడు. నా కాపురం ఏమిటి? ఎందరో స్త్రీల బ్రతుకులు వాడి వల్ల నాశనం అవుతున్నాయి. సాటి స్త్రీల బ్రతుకుల్ని వాడి బారి నుంచి కాపాడాలన్నదే నా ఆశయం."

"నువ్వు చెప్పేది చాలా చిత్రంగా ఉంది. స్త్రీల కోసమే కలం పట్టిన రచయిత ఆయన."

"అబద్ధం. వాడు పేరు కోసం, డబ్బు కోసం కలం పట్టాడు."

"తప్పమ్మా. నువ్వెవరి గురించి మాట్లాడుతున్నావో."

"తెలుసు. జ్ఞానమూర్తి అనబడే తుచ్ఛుడి గురించి — ఏ పత్రిక తెరిచినా, ఏ రోజు టివి పెట్టినా ఎవడి దరిద్రగొట్టు నామస్మరణ తప్పదో వాడే. స్త్రీలకి ప్రబల శత్రువు. వాడి గురించే మాట్లాడుతున్నాను."

"పోనీ జ్ఞానమూర్తి వల్ల నీకు కలిగిన అపకారం."

"చెప్తాను. వినండి. నా భర్త చాలా ఉత్తముడు. నన్ను ఏనాడూ పన్నెత్తు మాట అనేవారు కాదు. ఒక్క సిగరెట్ల విషయంలో తప్ప మరే విషయంలోనూ మా మధ్య అభిప్రాయభేదాల్లేవు."

"అంతకంటే ఒక స్త్రీ కోరుకునేదేముంది?"

"చీరలంటే చీరలు, నగలంటే నగలు, టెలివిజన్ అంటే టెలివిజన్. ఏది అడిగినా వెంటనే కొనేవారు."

"మరింకేం?"

"చెప్పనివ్వండి. టెలివిజన్ కొన్నాక మా కష్టాలు మొదలయ్యాయి. సాయంత్రం ఇద్దరం టివి చూస్తూ గడిపేవాళ్లం. అదే నా కొంప నిలువునా ముంచింది."

"అదేమిటమ్మా? హాయిగా భర్తతో కలిసి!"

"అప్పటిదాకా హాయిగానే ఉన్నాను యువరానర్. నన్ను సంతోష పెట్టటం కోసమే ఎప్పుడూ ఆలోచించే భర్త, అత్తవారేదైనా ఇస్తే తీసుకోవటానికి ఇష్టపడని భర్త..."

"ఎంతో అదృష్టవంతురాలివి నువ్వు."

"నేనే కాదు. ఈ దేశంలో నాలాంటి వాళ్లు చాలా మందే ఉన్నారు. వాళ్లందరి బ్రతుకులు కాపాడాలనే ఈ పని చేశాను."

"ఇంతకీ జ్ఞానమూర్తి నేరం ఏమిటో చెప్పలేదు."


## బాలీవుడ్ బాణీ



### రాజకీయాల్లోకి బెంగాలీ బాబు

సినిమాల్లో అవకాశాలు లేని నటులంతా రాజకీయాల్లోకి దిగడం ఉత్తరాదిలో ఎక్కువైంది. చిత్ర రంగంపై విసిగివేసారిన మిథున్ చక్రవర్తి రాజకీయాల్లోకి దిగి వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయాలనే నిర్ణయానికి వచ్చాడు. అందులో భాగంగానే ఇటీవల కలకత్తా దుర్గ పూజల సందర్భంగా 16 మంటపాలను ఆయన ప్రారంభించాడు. ఒక్కో మంటపం ఆవిష్కరణకూ యాభై వేల రూపాయలు తీసుకున్నాడు. ఈ డబ్బులో సగం మదర్ థెరిస్సా ట్రస్ట్‌కు, మరో సగం ముఖ్యమంత్రి సహాయ నిధికి ఇస్తానని ప్రకటించాడు. ఇంతకూ తాను చేరే పార్టీ ఏదో మాత్రం చెప్పకుండా సస్పెన్స్‌లో పెట్టాడు. అప్పుడే రాజకీయాలు ఒంటబట్టినట్టున్నాయే!

మసూద్ అన్సారి



ఆఫీసు డ్యూటీలోనే ...

"పంటి నొప్పితో బాధపడుతూ కూడా పళ్లు ఎందుకు పీకించుకోరాదు?"

"నిన్ననే పంటి డాక్టర్లకు ఇన్‌కమ్ టాక్స్ కట్టమని నోటీసు ఇచ్చాను!"

చాగాపురం (గద్వాల్)

## బాలీవుడ్ బాణీ



### అజర్‌భాయిపై ఆరోపణలా...

క్రికెట్ తారలకు, సినిమా తారలకు మధ్య ఉండే సంబంధాలు, ఆ సంబంధాలు కలిగించే సంచలనాలు అందరికీ తెలిసినవే! ఇంతకాలం వాటికి దూరంగా ఉంటూ వస్తున్న భారత్ క్రికెట్ జట్టు కెప్టెన్ అజారుద్దీన్ తాజాగా ఒక వివాదంలో చిక్కుకున్నాడు. ఒకనాటి మోడల్ నటి సంగీత బిజిలానీతో అజర్ విందులు, వినోదాలతో కనిపించడమే ఇలాంటి పుకార్లకు ఆస్కారం కల్పించింది. అంతే కాదు, ఆమెకు అజర్ మెర్సిడస్ -కారు కొనిపెట్టాడని, జుహూ చాంద్ సొసైటీలో ఫ్లాట్ తీసుకున్నాడని ఇలా రకరకాల కబుర్లు తెలుస్తున్నాయి. జనానికి తెలిసిపోయినవి అటుంచి, భవిష్యత్తులోనైనా ఇద్దరూ జాగ్రత్తపడడం మంచిదేమో!

మసూద్ అన్సారి

---

"అంత ఉత్తముడైన నా భర్త జ్ఞానమూర్తిగాడు రాసిన నాటకాలు చూశాక మారటం మొదలుపెట్టారు.' జ్ఞానమూర్తిగాడి కళ్లు మంచివి కావు. కట్నం కోసం పెళ్లాన్ని హింసించే మొగుళ్లనీ, మొగుడేం చేసినా పడి ఉండే పెళ్లాల్నీ, కోడళ్లని చంపటం కోసమే బతికే అత్తల్నీ తప్ప మంచివాళ్లని వాడు చూడలేదు. అవి — ఆ నాటకాలు చూసి మా వారికి తానొక మహానుభావుడిననీ, నన్ను ప్రేమగా చూడటం వారి త్యాగబుద్ధికి నిదర్శనం అనీ అనిపించసాగింది.

"చూశావా... లోకంలో అంతా ఎలా ఉంటారో?" అనటం మొదలుపెట్టారు.'

"కోపం వస్తే ఓ తిట్టు తిట్టటం, కసరటం మళ్లీ కాసేపటికి మామూలై పోవటం... అసలు ఆడదాన్ని అన్ని రకాలుగా హింసించవచ్చని ఆయనకి తెలీదు. జ్ఞానమూర్తిగాడే నేర్పాడు.

"లోకంలో అత్తలకంటే తానెంత మంచిదో సాధ్యమైనప్పుల్లా గుర్తు చేసేది మా అత్తగారు. అంతకుముందు ఆవిడ ఎప్పుడూ నన్ను వెనకేసుకొచ్చి కొడుకునే మందలించేది.

"ఇంట్లో నాకు స్వేచ్ఛపోయింది. సరదాకి అలిగినా గొడవలు మొదలు 'నా మంచితనం నీకు తెలీటం లేదు. ఆ నాటకంలో ఉన్న లాంటి మొగుడొస్తే తెలిసేది' అని నా భర్త అనటం జ్ఞానమూర్తి వంటి నీచుల గొప్పతనం వల్లే కదా?

"మామూలుగా కాపురం చేస్తున్న మొగాళ్లందరూ తామేదో మహానుభావులం అనేసుకునేందుకెవరు కారణం? వాళ్లల్లో అంతరాంతరాల్లో అణిగి పడున్న కర్కశత్వం వెలికితీసిన ఘనత ఎవరిది? నాటకం చివరదాకా చూపించే దృశ్యాలన్నీ ఏం నేర్పుతున్నాయి? అవి చూసిన ఏ ఆడదైనా మొగుడికీ, అత్తగారికీ వ్యతిరేకంగా ఒక్క మాట మాట్లాడగలదా? ఆడదానికి మరింత పిరికిమందు నూరిపోస్తూ పైగా స్త్రీల కోసం కలంపట్టానని వాడు చెప్పుకుంటే నమ్మటానికి ఇందరికీ బుద్ధి లేదా వివేకం లేదా? అందుకే ఓ చీడపురుగుని ఏరివేశాను."

కోర్టు హాల్లో వాతావరణం కొద్దిగా మారింది. తిరస్కారభావం స్థానంలో కుతూహలం, ఆగ్రహం బదులు ఆలోచన మొదలైన సూచనలు కనిపించసాగాయి.

ఆడవాళ్లు ఒకరివైపు మరొకరు చూసుకుని ఛటుక్కున ముఖాలు పక్కకి తిప్పుకున్నారు.

మొగుళ్లు పక్కలకి చూడకుండా ముందే జాగ్రత్తపడి తలలు దించుకున్నారు.

"లక్షల ఏళ్లక్రితం మనువేం చెప్పాడో నా భర్తకీ, అత్తగారికీ వీడే నేర్పి పెట్టాడు. మేం సామాన్యులం సార్! మామూలుగా బ్రతికేవాళ్లం. జ్ఞానమూర్తిగాడి కున్నన్ని తెలివితేటలు మాకుండవు. అంత చదువూ ఉండదు." ఒక్కసారి శారద 'బరస్ట్' అయి ఏడుపు మొదలుపెట్టింది.

"కంట్రోల్ యువర్ సెల్ఫ్ శారదా" అన్న జడ్జిగారి గొంతులో మార్పు కొట్టవచ్చినట్లు కనిపించింది.

"చివరికి దేవుడి భయం కూడా లేకుండా చేయాలని వీడు నాస్తికత్వం కూడా ప్రబోధిస్తున్నాడు." మళ్లీ ఆమె గొంతులోంచి ఏడుపు తన్నుకొచ్చింది.

"మనుషుల్ని భయపెట్టేవీ, కించపరిచేవీ, హింసని పరోక్షంగా ప్రోత్సహించేవీ ఎవడు రాసినా వాడు ద్రోహి — వాడికి మరణశిక్ష తప్పదు."

జడ్జిగారు కళ్లజోడు తుడుచుకుంటూ నెమ్మదిగా ప్రశ్నించారు.

"నాటకాలు చూసినంత మాత్రాన అందులో మంచికి బదులు చెడుని..."

"వద్దు యువరానర్! ఆశయాలు, ఊహలు వద్దు. మేం సామాన్యులం. బలహీనులం. సగటు మనుషులం. మా శక్తి మా రోజువారీ పనులకే సరిపోదు."

"అయితే మాత్రం చంపేస్తావా?"

"మరేం చెయ్యాలి యువరానర్? రోగాలు తెస్తున్నాయని పందుల్ని చంపటంలేదూ? దోమల్ని చంపటంలేదూ? పాముల్ని చంపటం లేదూ?"

ఆ రోజే మహిళా మండలి కొత్త తీర్మానం చేసింది. "శారద తరపున వాదించేందుకు ఒక లాయర్ని పెట్టాలని."

ఎందరో రచయితలు నిర్ణయించుకున్నారు.

"ఎంత గొప్పగా రాస్తున్నామో అనుకునే ముందే పాఠకులపై దాని ప్రభావం ఎలా ఉంటుందో ఆలోచించాలని."

"మంచి అత్తల్నీ, మంచి భర్తల్నీ, ధైర్యం, తెలివీ ఉన్న ఇల్లాళ్లనీ చూపటం మరింత అవసరం" అని ప్రేక్షకులు చాలా మంది అనుకున్నారు.

"శారద చెప్పిన విషయాలు న్యాయస్థానం పరిధిలోకి రావు. ఆమెకి న్యాయంచేయగలిగే వ్యవస్థ ఎక్కడుంది?" అన్నది ఎందరికో అర్థంకాని ప్రశ్న అయింది.

జ్ఞానమూర్తిని చంపినా, మానినా ఆమెకు ఇంట్లోనో లేక జైలులోనో శిక్ష తప్పదు.

"ఇది రచయితల స్వాతంత్ర్యంపై, స్వేచ్ఛపై సాగిస్తున్న యుద్ధం — కుట్ర" అన్నారు కొందరు.

"చంపటం పరిష్కారం కాదు. అయితే నాలుక కొయ్యటం, బొటనవేలు నరకటం, చెవుల్లో సీసం పోయటం సగటు మనిషికి చేతనైన విద్యలు కావు. వాళ్లకి కోపం వస్తే..." శారదకి ఆవేశం వచ్చింది.

✿ ✿ ✿

"చంపేస్తారు. చంపి పాతేస్తారు."

"శారదా... శారదా... ఏమైంది నీకు?"

భర్త తట్టి లేపుతుంటే కలగన్న శారద కళ్లు విప్పింది.

అయోమయంగా చుట్టూ చూస్తోంది.

"అంటే కల — జ్ఞానమూర్తి?"

విషయం అంతా విన్న శారద భర్త పగలబడి నవ్వుతూ అన్నాడు.

"జ్ఞానమూర్తి ఒకడు చస్తే మరో వెయ్యి మంది పుడతారు. తప్పు వాడిది కాదు. మంచి రచనలు చేయగలిగీచెయ్యని వాళ్లది. ఓ మంచి కథ చదివీ పత్రికకి ఉత్తరాలు రాయని వాళ్లది."

"అంటే..?"

"ఒక్క ప్రశ్న వేసుకో శారదా — ఉత్తమ సాహిత్యం కరువై పోవటానికి కారణం ఎవరు? పోనీ ఓ మంచి రచన రావటానికి మనలాంటి వాళ్ల పాత్ర ఎంత? మనం ఏం చేస్తున్నాం? మనమూ చీకటిని తిడుతున్నాం తప్ప..."

"అవునండీ... దీపాలు వెలిగించాలి" అంది శారద భర్త భుజం మీద చెయ్యి వేసి లేస్తూ. ◆